'పల్లె వెలుగు' వచ్చేనా?

- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

లింగాల: మండలంలోని పలు గ్రామాలు నేటికి 'పల్లె వెలుగు' బస్సులకు నోచుకోలేదు. మండల కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల నుంచి పలు రకాల పనులకు వందలాదిగా రాకపోకలు కొనసాగిస్తుంటారు. వారంతపు సంత జరిగే ఆదివారం వివిధ గ్రామాల ప్రజలు నిత్యావసర సరకులు, కూరగాయలు ఇతరత్రా వాటిని కొనుగోలు చేయుటకు వస్తుంటారు. కాని బస్సులు లేక పోవడంతో ఆటోలు, జీపులు ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రధాన మార్గాలలో బస్సులు నడుపడంలో చూపుతున్న శ్రద్ధ గ్రామీణ ప్రాంతాలపై చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణానికి నోచుకోలేక పోతున్నట్లు మహిళలు వాపోతున్నారు.

బస్సులు వెళ్లని గ్రామాలు ఇవే..

మండలంలోని కొత్తచెర్వుతండా, ఎంసీ తండా, జీల్గుపల్లి, జీల్గుపల్లితండా, దత్తారం, శాయిన్‌పేట తదితర గ్రామాలకు ఇప్పటికీ పల్లె వెలుగు బస్సులు రావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తకుంటపల్లికి విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళలో బస్సును తిప్పుతున్న అధికారులు ఆదివారం, ఇతర సెలవుల రోజులలో బంద్ చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు రెండు పూటలా బస్సులను నడిపితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులను తిప్పడంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.


ప్రైవేటు వాహనాన్ని ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

బస్సు సౌకర్యం కల్పిస్తాం

అన్ని వేళలో గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు నడిపిస్తాం. కొన్ని ప్రతికూల పరిస్థితుల కారణంగా బస్సులను నడుపలేక పోతున్నాం. ప్రయాణికులు కూడా ఆర్టీసీని ఆదరిస్తే ఏర్పాటు చేస్తాం. రద్దీకి అనుగుణంగా ఆయా గ్రామాలకు బస్సుల ట్రిప్పులను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– పి. మురళి దుర్గా ప్రసాద్, డీఎం అచ్చంపేట

ఇబ్బందులు పడుతున్నాం



మండలంలోని కొత్తచెర్వుతండాకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి అవుసలికుంట ద్వారా బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు రావడం లేదు. వివిధ ప్రాంతాలకు పోవాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది.

–మొగిలి మల్లేష్, మాజీ సర్పంచు కేసీతండా

అన్ని రోజులు బస్సులు నడపాలి



కొత్తకుంటపల్లికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అచ్చంపేట నుంచి బస్సు ట్రిప్పులు చేస్తున్నారు. కాని ఆదివారం ఇతర సెలవు రోజుల్లో బస్సు రావడం లేదు. సెలవు రోజులు సైతం బస్సులను నడిపి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– రాజీవ, కొత్తకుంటపల్లి

క్లుప్తంగా

సమస్యలపై నిరంతరం పోరాటం

కందనూలు: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందని జిల్లా కన్వీనర్ శివశంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రవేటు హాల్‌లో నూతన పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.పట్టణ అధ్యక్షుడిగా డా. ప్రదీప్ కుమార్, కార్యదర్శిగా ఎస్. ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శిలు గా ఎ.శివకుమార్,ఎం.శివకుమార్, మల్లేష్ యాదవ్, నగర ఉపాధ్యక్షుడిగా జి.మార్కండేయ, కార్యవర్గ సభ్యులుగా మధు, శ్రీరామ్, వికాస్, జ్ఞానేందర్, రమేష్, రాకేష్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు, జిల్లా ఖేలో భారత్ కన్వీనర్ రమేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



కల్వకుర్తి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై విద్యార్థులకు ఐసీటీసీ కౌన్సిలర్ లింగయ్య అవగాహన కల్పించారు. తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ రాకుండా ఎన్‌వీపీ ఇచ్చి బిడ్డను కాపాడుకోవచ్చన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1097ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ శివయ్య, రాజు, పీఈటీ శారద ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి త్రిశూలం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వరం క్షేత్రం వద్ద చంద్రగ్రహణం అనంతరం భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దముద్దునూరు గ్రామానికి చెందిన దగడాల సరస్వతి కుటుంబ సభ్యులు ఆలయంలో పూజలు చేసి వెండి త్రిశూలాన్ని బహూకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, అర్చకుడు వీరయ్యశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

లింగాల: మండల కేంద్రానికి చెందిన పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఇర్కు మహేష్ సోమవారం క్రీడాకారులకు వాలీబాల్, నెట్‌ను వితరణ చేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, ఖాళీ సమయంలో వాలీబాల్‌లో మెళకువలు నేర్చుకొని ప్రతిభ కనబర్చాలని దాత క్రీడాకారులను కోరారు.

రాకపోకలు ప్రారంభం

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట, రామగిరి గ్రామాల మధ్య ఆగస్టు మాసంలో ఉధృతంగా దుందుభీ నది ఉప్పొంగి పారడంతో రాకపోకలను నిలిపివేశారు. దాదాపు 25 రోజుల తర్వాత వరద ప్రవాహం తగ్గడంతో సోమవారం ఆర్టీసీ బస్సులను ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు.

ఫిక్స్‌డ్ వేతనం అందించాలి

కొల్లాపూర్: ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నెలకు రూ.18 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో కొల్లాపూర్, పెంట్లవెల్లి పీహెచ్‌సీల పరిధిలోని ఆశావర్కర్లు సమావేశం అయ్యారు. సమావేశానికి శివవర్మ హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సలీం, శ్రీదేవి, శివలీల, గౌరమ్మ, అరుణ, దీప, గీత, మంజుల తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోడేరు: మండలంలోని నాగులపల్లి నుంచి పెద్దకొత్తపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పస్పుల శివారులో తహసీల్దార్ విజయ్‌కుమార్ పట్టుకొని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

భక్తులకు అన్నదానం

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం భక్తులకు కల్యాణ్‌వాగుతండాకు చెందిన ఆర్. సుమన్, ఠాగూర్‌తండాకు చెందిన జంపు, భీరయ్యల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ వైస్ చైర్మన్ అరుణ్, అర్చకులు నరహరిశర్మ, శివశర్మ, సంతోష్‌శర్మ, సురేష్‌శర్మ, కిషన్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎంఈఓ తనిఖీ

లింగాల: మండలంలోని అప్పాయపల్లి, చెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను, పద్మన్నపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ తనిఖీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్ఎం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది


నాగర్‌కర్నూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీడీఓ చిన్నమ్మ, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి


తెలకపల్లిలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కందనూలు: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, ఉపాధ్యాయులంతా అంకిత భావంతో పనిచేసి మండలాన్ని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఉంచాలని ఎంపీడీఓ చిన్నమ్మ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మార్సీలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డితో కలిసి 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. తహసీల్దార్ తబిత, గుడిపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం కురుమయ్య, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం లత, మంతటి హెచ్ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

వెల్దండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 18 మందిని సోమవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు సన్మానించారు. హెచ్ఎం ప్రేమకుమారి, రవీందర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిపల్లి ఎమ్మార్సీ కార్యాలయంలో..

చారకొండ: మండలంలోని మర్రిపల్లి ఎమ్మార్సీ కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. 12 మంది ఉపాధ్యాయులను ఎంఈఓ ఝాన్సీరాణి సన్మానించారు. కాంప్లెక్స్ హెచ్ఎం భగవాన్ రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కమాలాకర్ రావు, మహిపాల్ నాయక్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మార్సీ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులు జయమ్మ, మురళీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, జైపాల్ లను సన్మానించారు.

లింగాలలో..

లింగాల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఉపాధ్యాయులతో పాటు ఎంఈఓ బషీర్ అహ్మద్‌ను న్యూ మాస్టర్ మైండ్ జూనియర్ కాలేజీ అచ్చంపేట బ్రాంచ్ డైరెక్టర్ సనాతన రమాదేవి ఆధ్వర్యంలో సన్మానించారు. ఎస్టీ హెచ్‌డబ్ల్యూఓ బాలస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌కు అవార్డు అందజేత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రిన్సిపాల్ జయమ్మకు జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో సత్కరించారు.

కృష్ణానదిలో అలవి వలలు అరికట్టాలి



కొల్లాపూర్: కొల్లాపూర్ మండలంలోని కృష్ణానదీ తీరం వెంట అలవి వలలతో చేపల వేటను అరికట్టాలని కోరుతూ మత్స్యశాఖ ఏడీ.రజినికి అలివి వలల వ్యతిరేక సంఘం నాయకులు భరత్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో రజినిని కలిశారు. సోమశిల, మంచాలకట్ట, మల్లేశ్వరం, అమరగిరి ప్రాంతాల్లో అలవి వలలతో చేపల వేట సాగుతోందని ఆమెకు వివరించారు. మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లేష్, రాము తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతు



తిమ్మాజీపేట: మండలంలోని గొరిట గ్రామం నుంచి గుమ్మకొండ ప్రధాన రహదారి వరకు, అదేవిధంగా గొరిట బస్టాండు నుంచి గొరితతండా వరకు రోడ్డుపై గుంతలు ఏర్పాడ్డాయి. గొరిట గ్రామానికి చెందిన యువకుడు మొసలి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి స్పందించి సొంత ఖర్చులతో రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. గుంతలలో మొర్ర వేసి చదును చేశారు. అంతకు ముందు పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పించారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆంజనేయులు, రాంచందర్, సస్‌రెడ్డి, వెంకటయ్య, తిరుపతయ్య, పర్శరామ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం


కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్


వెల్దండలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్/కొల్లాపూర్/తాడూరు/ ఊర్కొండ/ వెల్దండ/చారకొండ: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాపై అధికారులు అఖిలపక్షం నాయకులతో సమావేశం అయ్యారు. అభ్యంతరాలు తెలపాలని కోరారు.

■ కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరాములు సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలను స్వీకరించి వారితో చర్చించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయతి విజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణగౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్: మండలంలోని ఓటర్ల జాబితాపై సోమవారం అఖిలపక్ష పార్టీల నాయకులతో ఎంపీడీఓ భాస్కర్ సమావేశం నిర్వహించారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఎంపీడీఓ సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ, కాంగ్రెస్ నాయకులు కాంతారావు, సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ తదితరులు ఉన్నారు.

■ తాడూరులో ఎంపీడీఓ ఆంజనేయులు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

■ ఊర్కొండ ఎంపీఓ లక్ష్మణ్,వెల్దండలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, చారకొండలో ఎంపీడీఓ శంకర్ నాయక్‌లు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్ రూరల్: వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అర్హులైనవారందరికి పింఛన్లు మంజూరు చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ అడెపు నాగార్జున, మద్దిలేటి పాల్గొన్నారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..

ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ఒక్కరోజుకు రూ.700లు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోళ్ల యేసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వేనేపల్లి రవిందర్, మద్దిలేటి, వెంకటస్వామి, విష్ణు, చింతపల్లి కుర్మయ్య, ప్రకాష్, రాములు, అంజనమ్మ, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బిజినేపల్లి: పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్య కోసం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న నందివడ్డేమాన్ జెడ్పీహెచ్ఎస్‌లో 10 వ తరగతి పూర్తి చేసిన విద్యార్థి వెంకటేష్‌కు సోమవారం ఎన్నారై తిప్పిరెడ్డి రాంచంద్రారెడ్డి రూ.60000 ఆర్థికసాయాన్ని అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం మురళీ మోహన్‌చారి తెలిపారు. ఈ సందర్భంగా దాతకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచు జగత్ చంద్రయ్య, ఉపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



చారకొండ: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి మంజుభార్గవి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు చారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు స్వల్ప జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 73 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన, వార్డెన్ బాలరాజు సీహెచ్ఓ బాల్‌రాం, పీహెచ్ఎన్ కృష్ణమ్మ, ఎన్ఎం, ఆశాలు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

దోమలపెంట: ఈగలపెంటలోని డీఏవీ ఆంగ్ల పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రసాద్ అభినందించారు.



ఘనంగా అక్షరాస్యత దినోత్సవం

కందనూలు/వెల్దండ/పెద్దకొత్తపల్లి/లింగాల/తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. డీఈఓ రమేష్‌కుమార్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం లత, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

■ వెల్దండ మండలంలోని పెద్దాపూర్, కొట్ర గ్రామాల్లో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులకు అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పురవీధుల గుండా కొనసాగింది. ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం రామ్‌పాల్, సీఆర్పీలు ఈశ్వర్, రాము, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

■ లింగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్య ఆవశ్యకతపై నినాదాలు చేశారు. హెచ్ఎం కొండయ్య, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌శర్మ, రాంచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

■ తెలకపల్లి: మండల కేంద్రంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శోభన్‌బాబు, ఎమ్మార్సీ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరమ్మతు చేయాలని వినతి

వెల్దండ: మండలంలోని కొట్రలో బీటీ రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల మాజీ అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ 2001 సంవత్సరంలో నిర్మించిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. రాత్రివేళలో ప్రమాదాలబారిన పడుతున్నామని వివరించారు. వెంటనే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు బలరాం, జంగయ్య, నాయకులు పరమేష్, రాజు, దశరథంయాదవ్, బాలస్వామి, కృష్ణ, జంగయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల నుంచి బొల్లారం, తూంకుంట గ్రామాల క్రాస్ రోడ్డు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులకు మాజీ ఎంపీపీ నిరంజన్ రావు అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ నిధుల నుంచి రూ.2.30 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. డీఈ సత్యం, ఏఈ సాయిరాం, సింగిల్ విండో మాజీ చైర్మన్ రఘుపతిరావు, మాజీ సర్పంచ్‌లు, మేకల నాగరాజు, పాశం నాగరాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



మన్ననూర్: పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు జానకి, జిల్లా కార్యదర్శి శేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ఓం చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై 10 శాతం, ఔషధాలపై జీఎస్టీ పూర్తిగా ఎత్తేయడం హర్షనీయమన్నారు. సంబు శ్రీనువాసులు, కుమ్మరి పర్వతాలు, పెర్మల ప్రసాద్, వాల్యానాయక్, బాలకృష్ణ, శ్రీకాంత్, తిరుపతయ్య, పత్యానాయక్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 భోజన క్యాంటీన్లు ప్రారంభించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో రూ.5ల భోజన క్యాంటీన్లు ప్రారంభించాలని బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బాబు జగ్జీవన్‌రావ్ భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆ పార్టీ నాయకులు బోనాసి రాంచందర్, కల్యాణ్, పృథ్వీరాజ్ హాజరై మాట్లాడారు. పేదలు ఆకలి తీర్చాలని కోరారు. నాగేస్, భాస్కర్, రాజు, బాలనాగులు, శ్రీను, నరేష్, రామకృష్ణ, సాయి బాబు, కన్వీనర్ వెంకటేష్ పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో చేతి వృత్తుల ప్రదర్శన

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు చేతివృత్తుల ప్రదర్శన ఏర్పాటుచేశారు. సోమవారం ప్రదర్శనను మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. ఇటీవల కాలంలో మెప్మా పర్యవేక్షణలో శిక్షణ పొందిన మహిళా సంఘాల సభ్యురాలు కుట్లు, అల్లికలు, బుట్టలు, తినుబండారాలు తయారుచేసి ప్రదర్శించి విక్రయించారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా అధికారిణి శ్వేత, సిబ్బంది ఫరూఖ్, లావణ్య, మహిళా సంఘాల నాయకురాళ్లు వనజారెడ్డి, సంధ్య, నాగమణి ఉన్నారు.

కబ్జాదారుల నుంచి నక్షబాటను విడిపించండి

ఊర్కొండ: మండలంలోని కల్వకుర్తి– జడ్చర్ల ప్రధాన రహదారి నుంచి రేవల్లి వెళ్లే డొంక బాట (నక్షబాట) బాటను కబ్జా కోరల్లో నుంచి విడిపించాలని తహసీల్దార్ యూసుఫ్ అలీకి రైతులతో పాటు ఊర్కొండ మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాసులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతంలో నక్షబాటలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రంథాలయాలను ఆధునీకరిస్తాం



బల్మూర్: జిల్లాలోని గ్రంథాలయాలను అన్ని వసతులతో ఆధునీకరిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంతో పాటు ఉప్పునుంతల, అమ్రాబాద్, బల్మూర్ శాఖ గ్రంథాలయాలను సందర్శించారు. ఉప్పునుంతల గ్రంథాలయ నూతన భవన నిర్మాణం కోసం గ్రామానికి చెందిన దాత నరేందర్‌రెడ్డి (కాంట్రాక్టర్) రూ.30 లక్షలు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. బల్మూర్ గంథ్రాలయం చుట్టు కాంపౌండ్ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కల్పించి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్యాంసుందర్, పరమేశ్వరి ఉన్నారు.

దసరాకు బతుకమ్మ చీరలు అందిస్తాం



తిమ్మాజీపేట: విజయ దశమి పర్వదినం సందర్భంగా మహిళలకు నాణ్యమైన బతుకమ్మ చీరలు ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర టెలికామ్ బోర్డు సభ్యుడు శ్రీనివాస్ బహదూర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో మహిళలు ఎంతో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం నాసిరకం చీరలు ఇచ్చిందన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, జంగిరెడ్డి ఉన్నారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: గిరిజన తండాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విషజ్వరాలతో తండాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు శంకర్‌నాయక్, తదితరలు పాల్గొన్నారు.

మొండి బకాయిలు చెల్లించాలి

కోడేరు: యూనియన్ బ్యాంకులో గతంలో తీసుకున్న రుణాలకు రైతులు మొండి బకాయిల కింద పదిశాతం రుణాలు చెల్లించాలని బ్యాంకు మేనేజర్ శంకర్‌నాయక్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

వెల్దండ: ఎస్సీల వర్గీకరణలో ప్రభుత్వం మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని దీనికి నిరసనగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వడంతో సోమవారం మాల మహానాడు సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో మాలల ఉద్యమాలను ఆపలేరన్నారు. ప్రభుత్వం వెంటనే జీఓ నంబర్99ను రద్దు చేయాలని రోస్టర్ విధానంలో 22 నుంచి 16 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, జంగిలి ఆనంద్ కుమార్,శ్రీనివాస్, రవి కుమార్, రాజు, కొండల్ తదితరులు ఉన్నారు.

ముందస్తు అరెస్ట్ సరికాదు

బిజినేపల్లి: మాల మహానాడు నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని ఆ సంఘం అధికార ప్రతినిధి సామ మహేష్ అన్నారు. సోమవారం మాల మహానాడుకు చెందిన నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కూన నిరంజన్, ఎద్దుల ఉదయ్, కర్నె రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, జగన్, ఆంజనేయులు, కూన అంజి, రామకృష్ణ, చెన్నయ్య, మల్లేష్ లు పాల్గొన్నారు.


బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

తాడూరులో..

తాడూరు: ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి అన్నారు. క్యాంపు కార్యాలయ ముట్టడిలో భాగంగా మాల మహానాడు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో నాయకులు చెన్నయ్య, కురుమూర్తి, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.